# సింగిల్ పేజీ కథలు

## పసి మనసు

"మా అమ్మ కదూ... మా తల్లి కదూ. ఈ ముద్ద నాదంట. ఈ ఒక్కటి తిన్నావంటే ఇంతకంటే అందంగా ఉంటావమ్మా. నా బంగారం కదూ!"

దివ్యను సముదాయిస్తూ అన్నం తినిపిస్తోంది వసంత.

తల్లి సముదాయింపుతో మరింత గారాలుపోతోంది దివ్య. దివ్య చిన్నపిల్లేం కాదు. ఆరు దాటి ఏడో సంవత్సరంలోకి రాబోతోంది. అయినా ఇంకా వీడని పసితనం. ఒక్కతే కూతురవ్వడం వలన ముద్దులు, ముచ్చట్లు ఎక్కువే. మంకుతనం, అల్లరి స్వభావం లేవుగానీ అన్నం తినిపించాలన్నా, బడికి తయారుచేసి పంపాలన్నా ప్రతీరోజు ఈ పర్వం తప్పదు.

మరొక ముద్ద కలిపి "ఇది డాడీ ముద్ద. ఇది కూడా తిన్నావంటే మీ డాడీలాగా ఎత్తు పెరుగుతావంట. నా బంగారం బుగ్గలు చూడు సరిగ్గా తినక ఎట్లా లోతుకుపోయాయో!" ఎలాగో తంటాలు పడి మరో ముద్ద తినిపించేసింది.

అప్పుడే ఆఫీసు నుండి రవీంద్ర వచ్చాడు. బైక్ స్టాండ్ వేసి లోనికొస్తూనే "ఎందుకు వసంతా... అంత బలవంతంగా పెడతావ్. వేళగాని వేళ తింటే రాత్రికి గడబిడ చేస్తుందేమో. జ్వరం నుండి తేరుకుని రెండు రోజులేగా అయింది" అన్నాడు.

"ఈ రోజు లంచ్ బాక్స్ అలాగే తీసుకొచ్చేసిందండీ. ఒక్క మెతుకైనా ముట్టలేదు. ఈ వయసులో కాకపోతే మరెప్పుడు తినాలి" అని, "ఆదివారం నీ బర్త్‌డే కదా. నీకు డాడీ మంచి ఫ్రాక్ తెస్తారు. బోలెడు స్వీట్సు తెస్తారు. నీ ఫ్రెండ్సందరినీ పిలిచి బోలెడు చాక్‌లెట్స్ పంచిపెడదాం. సరేనా. మరి ఈ కొద్దిగా కూడా తినేసేయ్!" అంది వసంత.

తల్లి మాటలతో దివ్య కళ్లు మెరిశాయి. "నా ఫ్రెండ్సందరినీ పిలుస్తావా మమ్మీ!" ఉత్సాహంలో ఉన్న దివ్యకు మరో ముద్ద... అలా అలా అంతా తినిపించేసింది వసంత.

గదిలోకెళ్లి డ్రెస్ ఛేంజ్ చేసుకొచ్చిన రవీంద్ర "రేపు మా అమ్మ వస్తుందట. మధ్యాహ్నం ఆఫీసుకు మా తమ్ముడు ఫోన్ చేసి చెప్పాడు. నాలుగున్నరకు అలారం పెడితే స్టేషన్‌కెళ్లి అమ్మను తీసుకొస్తాను" అన్నాడు.

ఆ మాటలు వినగానే చేతిలోని వెండి గిన్నెను పెద్ద చప్పుడుతో కింద పెట్టి చివ్వున ఇటు తిరిగింది వసంత. "మీ అమ్మగారు వెళ్లి పట్టుమని పది రోజులైనా కాలేదు. అప్పుడే మీ తమ్మడికి, మీ మరదలుగారికి ఈవిడగారి ముఖం మొత్తిందా. గోడకు కొట్టిన బంతల్లే అప్పుడే పంపించేస్తున్నారు!" అంది వ్యంగ్యంగా.

"ఛ...అవేం మాటలు వసంతా. ఈ వయసులో అమ్మకి ఎక్కడుండాలనిపిస్తే అక్కడుంటుంది. చెల్లెలి పెళ్లి విషయంలో మా తమ్ముడే గదా అంతా ఆదుకుంది. పెద్దకొడుకుగా అమ్మను చూసే బాధ్యత నాకు లేదా!" సర్ది చెప్పాడు రవీంద్ర.

"ఆయనగారికేం తక్కువ. బ్యాంక్ మేనేజరాయె. సుభద్ర కూడా ఉద్యోగం వెలగబెడుతోందిగా. నెల తిరిగే సరికి జీతాల కోసం పడిగాపులు పడే బతుకులు మనవి. నేను పీజీ చేసినా దివ్య కోసమేగా ఇంట్లో ఉంటోంది. ఏమైనా ఈ అదనపు బాధ్యతలు నేను మోయలేను బాబూ. ఆవిడగారికి సమయానికి అన్నీ అమర్చడం నా వల్ల కాదంటే కాదు!" నిష్కర్షగా చెప్పేసి వంటింట్లోకెళ్లిపోయింది వసంత.

మారు మాట్లాడలేదు రవీంద్ర. మనసులోనే నొచ్చుకున్నాడు. దివ్య మెల్లగా తండ్రి దగ్గరకొచ్చి "డాడీ... నా పుట్టిన రోజుకు నానమ్మొస్తుందా!" అని అడిగింది.

"ఔనమ్మా!" అంటూ కూతురి బుగ్గమీద ముద్దు పెట్టాడు రవీంద్ర.

ooo

ఆ రోజు ఆదివారం. దివ్య పుట్టిన రోజు.

ఇరుగుపొరుగు పిల్లలతో ఇల్లంతా సందడిగా ఉంది. కేరింతలతో మార్మోగిపోతోంది. అంతవరకు పిల్లలతో గడిపిన శకుంతలమ్మ గదిలోకెళ్లి నీరసంగా నడుం వాల్చింది.

ఈ నాలుగు రోజులుగా గమనిస్తూనే ఉంది శకుంతలమ్మ...కోడలు అయిన దానికీ, కానిదానికీ చిర్రుబుర్రులాడడం. భగవంతుడు నన్ను కూడా తీసుకుపోయినా బాగుండును. చెంపల నుండి కన్నీరు జాలువారింది.

అందరి సమక్షంలో కేక్ కట్ చేసింది దివ్య. అందరూ ఆనందంగా చప్పట్లు చరిచారు. ఒక్కొక్క ముక్క తీసి అందరికీ పంచిపెట్టింది వసంత. వచ్చిన పిల్లలందరూ రకరకాల ఫలహారాలు తిని సంతోషంగా ఇళ్లకెళ్లిపోయారు.

వంటింట్లో నుండి వస్తూనే దివ్య కోసం వెతికింది వసంత. కనిపించలేదు. అత్తగారి గదిలో నుండి మాటలు వినిపిస్తుంటే వెళ్లి గుమ్మం దగ్గర నిలబడింది.

"నానమ్మా! ఈ ఒక్కముక్క తిను. నా బుజ్జి కదూ. నా బంగారం కదూ. ఈ కేక్ తిన్నావంటే నువ్వు కూడా మమ్మీ డాడీల్లాగా బలంగా ఉంటావ్. నీ బుగ్గలు కూడా గుండ్రంగా మారిపోతాయి. నువ్వు కూడా నాకులాగానే చక్కగా, అందంగా ఉంటావ్. తిను నానమ్మా!" నానమ్మ పక్కనే కూర్చుని పసిపిల్లకు పెట్టినట్టు కేక్‌ను నోటికందిస్తోంది దివ్య.

శకుంతలమ్మ నవ్వుతూనే "ఛో.. నేను తినను గాక తినను. నువ్వు తినడానికి మీ అమ్మను సతాయించడం లేదా" చిన్న పిల్లలా మొరాయిస్తోంది శకుంతలమ్మ.

దివ్య మరింత మురిపెం చేస్తూ "నేనిక అల్లరి చేయకుండా తింటాను. స్కూల్‌కెళ్తాను. సరేనా నానమ్మా. నన్ను మా మమ్మీ అనుకో. నువ్వు నేననుకో. పెద్దవాళ్లు పసివాళ్లతో సమానమని నిన్ననే మా టీచర్ చెప్పింది. నువ్విప్పుడు చిన్న దివ్యవి. ఈ కాస్త ముక్క తినమ్మా. నా బొమ్మ కదూ. నా కొండ కదూ. తింటే నీకు బోలెడన్ని చీరలు కొనిపెడతా!" అని కేక్ ముక్కను నోటికందించింది.

శకుంతలమ్మ చిన్నపిల్లలా మెలికలు తిరిగిపోతూ దివ్యను ఒళ్లోకి లాక్కుంది. నానమ్మ బుగ్గ మీద దివ్య ముద్దు పెట్టింది. ఆమె కూడా దివ్యను ముద్దుపెట్టుకుంది. వారిద్దరి మధ్యా అనురాగం, ఆప్యాయతలే విరబూస్తున్నాయి.

ఇదంతా చూస్తున్న వసంత కళ్లు చెమ్మగిల్లాయి. అత్తగారి మీద చూపించిన విసుగు గుర్తుకొచ్చి గుండెల్లో కలుక్కుమంది. చెంగుతో కళ్లొత్తుకుని గదిలోకొచ్చింది. "దివ్య! నానమ్మను కొంచెం సేపు విశ్రాంతిగా పడుకోనీయమ్మా!" అని చెప్పి అత్తగారి వైపు తిరిగి "అత్తయ్యా! మీరు విశ్రాంతి తీసుకోండి. వేడి వేడి పాలల్లో కాస్తంత పసుపు, మిరియాలు కలుపుకొస్తాను. తాగి పడుకోండి. మధ్యాహ్నం రెండు గంటలకి భోజనానికి పిలుస్తాను. సరేనా!" పసిపాపను సముదాయించినట్లుగానే సముదాయించి వంటింట్లోకెళ్లిపోయింది వసంత.

కోడలి వంక నీరు నిండిన కళ్లతో చూసి... ముద్దుగా, మురిపెంగా దివ్యను గుండెలకు హత్తుకుంది శకుంతలమ్మ.

**-డా.జి.జాన్ కెనడి** (హైదరాబాద్)

## రచయిత్రి ఉత్తరం

కమలాకర్రావ్‌కి కలం స్నేహం అంటే మహా ఇష్టం.

అతనికిదో హాబీ అనేకంటే వ్యసనం అంటేనే

బావుంటుందేమో. అంత ఇష్టం మరి.

ఎప్పుడు చూసినా అతను తన కలం స్నేహితులకు ఉత్తరాలు రాస్తూనే కనిపిస్తాడు.

ఆడ-మగ-చిన్న-పెద్ద-ముసలి-ముతక అన్న తేడా లేకుండా అతను కలంస్నేహం చేస్తుంటాడు.

ఎక్కడైనా ఏదైనా చిరునామా కనిపించిందీ - అంటే చాలు. వెంటనే అతనా అడ్రస్‌కి ఓ ఉత్తరం రాశాడన్న మాటే. అట్నుంచి గనక జవాబొచ్చిందంటే ఇంకా అవతల వ్యక్తి అతని కలం స్నేహితుడో (రాలో) అయిపోయినట్టే లెక్క.

అవతలి వాళ్లకు విసుగెత్తి రాయటం మానేస్తేనే తప్ప అతను తనకు తానుగా ఎవరితోనూ కలం స్నేహాన్ని తెంపుకోడు. ఎంతో ఓపిగ్గా రాస్తూనే ఉంటాడు.

అలాంటి కమలాకర్రావ్‌కి ఒక రోజు కొత్త అడ్రస్ దొరికింది. దొరికిందంటే ఎక్కడో రోడ్డు మీద దొరికిందని కాదు. అతగాడో వీక్లీని తిరగేస్తుండగా అందులో కనిపించింది.

అదొక రచయిత్రి చిరునామా.

సదరు వీక్లీ వాళ్లు నిర్వహించిన మినీకథల పోటీలో 'పద్ధతి' అనే కథకి ప్రథమ బహుమతి రాగా ఆ సంచికలో ఆ కథతో పాటు ఆ కథారచయిత్రి ఫోటో మరియు చిరునామా కూడా ప్రచురించారు.

ఆమె ఇంకా కుమారే. పైగా అందంగా ఉంది. పైగా రచయిత్రి.

కమలాకర్రావ్ స్నేహకోటిలో ఒకరిద్దరు రచయితలు కూడా ఉన్నారు. మామూలు వాళ్ల కన్నా రచయితలు ఉత్తరాలు బాగా రాయగలుగుతారన్న విషయం వాళ్ల కలం స్నేహం వల్లే కమలాకర్రావ్‌కి తెలిసింది.

అయితే ఆ ఇద్దరూ కూడా మగవాళ్లే. మగ రచయితలు.

అతని స్నేహకోటిలో ఓ యాభై మందికి పైగా ఆడవాళ్లున్నా వాళ్లలో రచయిత్రులు మాత్రం లేరెవ్వరూ.

అంచేత ఆ ఫోటో అంటే చిరునామాని చూడగానే "అబ్బ రచయిత్రితో కలం స్నేహం ఎంత హ్యాపీగా ఉంటుందో" అని ఆనందపడిపోయి వెంటనే ఆమెకో ఉత్తరం రాసేశాడు.

"మీ కథ చదివాను. చాలా బావుంది. ఇంత చిన్న వయసులోనే ఇంత గొప్ప కథ రాసినందుకు అభినందనలు. పోతే నా పేరు ఫలానా. నా వివరాలు ఫలానా. నా చిరునామా ఫలానా. నా హాబీ కలం స్నేహం. నేను మీతో కలం స్నేహం చేయగోరుతున్నాను. మీకు అభ్యంతరం లేకుంటే నా ఈ ఉత్తరానికి జవాబివ్వగలరు. వగైరా...వగైరా...

ఇంట్రడక్టరీ లెటర్ కాబట్టి సింపుల్‌గానే రాశాడు కమలాకర్రావ్. సోదంతా తర్వాత రాయచ్చని.

దాన్ని పోస్ట్ చేసుకో. తన స్నేహకోటిలో ఓ రచయిత్రి కూడా చేరబోతున్నందుకు అతనికి చాలా సంబరంగా అనిపించింది.

అందుకే ఆమె ప్రత్యుత్తరం కోసం అతను చాలా ఆత్రంగా ఎదురుచూడసాగాడు.

వారం గడచినా రిప్లయ్ రాకపోయే సరికి బహుశా ఆమెకు కలం స్నేహం ఇష్టం లేదేమో అనుకుని నిరాశపడిపోయాడు. అందగత్తెనన్న అహంకారమేమో అని కూడా అనుకున్నాడు.

సంకుచిత భావాలు గల వ్యక్తి కాబోలు అని కూడా అనుకోకుండా ఉండలేకపోయాడు.

అంతలోనే 'ఛ..ఛ... ఎంతైనా ఆమె రచయిత్రి. సంకుచిత భావాలు ఎందుకుంటాయ్?' అని తనని తానే కేకలేసుకున్నాడు.

'మరైతే ఎందుకని రిప్లయ్ ఇవ్వలేదు?' అని ప్రశ్నించుకున్నాడు ఉండబట్టలేక.

మరో రెండు రోజులు వెయిట్ చేశాడు.

కానీ, సదరు వర్ధమాన రచయిత్రి వకుళాదేవి నుండి ప్రత్యుత్తరం రాలేదు.

తన ఉత్తరం ఆమెకు అందిందో లేదో పోస్ట్‌లో గానీ మిస్సయిందేమో. అలా పరిపరివిధాల ఆలోచించి మళ్లీ ఓ రిమైండర్ లెటర్ రాసి ఎందుకైనా మంచిదని దాన్ని రిజిస్టర్డ్ పోస్ట్‌లో పంపించదలచి అదే పని మీద పోస్టాఫీస్‌కి వెళ్లాడు కమలాకర్రావ్.

అతను పోస్టాఫీస్ మెట్టెక్కుతుండగా వాళ్ల ఏరియా పోస్ట్‌మేన్ ఎదురయ్యాడు.

"నాకేమైనా ఉత్తరాలు..?" అంటూ చెయ్యి చాచాడు కమలాకర్రావ్. చిన్నగా నవ్వు ముఖం పెట్టి.

"మీకు రాకుండా ఉంటాయా సార్?" అని అతనలా నవ్వి రమారమి ఓ పాతిక ఉత్తరాలు కమలాకర్రావ్ చేతిలో పెట్టి "అన్నట్టు మీకేదో వి.పి.పి. వచ్చింది ఇదుగోండి. ఇంటిమేషన్ లెటర్ . ఇప్పుడు తీసుకుంటారా? తర్వాత...." అని అడిగాడు పోస్ట్‌మేన్.

'నాకు వి.పి.పి. ఏంటబ్బా' - అనుకున్న కమలాకర్రావ్ ఆ ఇంటిమేషన్ లెటర్‌లో ఉన్న ఫ్రమ్ అడ్రస్‌ని చూసి నిర్ఘాంతపోయాడు.

అది రచయిత్రి (వర్ధమాన) వకుళాదేవి నుండి వచ్చింది.

'వి.పి.పి.లో నాకేం పంపుంటుందబ్బా?' అనుకుని అప్పటికప్పుడే దాన్ని విడిపించుకున్నాడు.

ఆ కవర్లో ఉన్న ఉత్తరంలోని ఆత్రంగా దృష్టి సారించాడు.

"మిత్రులు కమలాకర్రావ్‌గారికి మీ లేఖ చేరింది. రిప్లయ్ ఇవ్వటంలో ఒకింత జాప్యం కలిగింది. మన్నించండి.

ఎంతో స్నేహహృదయంతో మీరు నాతో కలం స్నేహం చెయ్యగోరినందుకు చాలా సంతోషం. మీ ప్రతిపాదనకు నేను మనసారా అంగీకరిస్తున్నాను.

పోతే మీలాగే ఇంకా అనేకమంది రాశారు. వాళ్లక్కూడా ఇలాగే రిప్లయ్ ఇస్తున్నాను.

ఇకపోతే- ఈ ఉత్తరాన్ని వి.పి.పి.లో ఎందుకు పంపానో తెలుసాండీ? నేను కొత్త రచయిత్రిని కదా. కథ రాస్తే ఎంత లేదన్నా నాకు కనీసం పారితోషికంగా రెండు వందల రూపాయలయినా లభిస్తుంది కదా. అదే పారితోషికాన్ని 'పద్ధతి' ప్రకారం మీ నుండి పొందడం కూడా ధర్మమే కదా. అందుకని అన్నమాట. కథ రాసే టైంని మీకు ఉత్తరం రాసేందుకు స్పెండ్ చేస్తున్నాను కదా..

మీరు వారానికి కనీసం నాలుగు లేఖలైనా రాస్తుండండి. నాకు నేను వి.పి.పి. ద్వారా రిప్లై ఇస్తాను. సెలవా మరి?

ఇట్లు - మీ నూతన నేస్తం - వకుళాదేవి (రచయిత్రి)

కళ్ల ముందు చుక్కలు మెరిశాయి ఉత్తరం చదవటం పూర్తయ్యేక కమలాకర్రావ్‌కి.

రిప్లయ్‌కి రెండొందలు. వారానికి ఎనిమిదొందలు... నెలకి మూడు వేల రెండొందలు. ఏడాదికి ముప్ఫై ఎనిమిది వేలు... అంత ఖరీదైన కలం స్నేహాన్ని తట్టుకోలేక అతను - బుర్ర గిర్రున తిరిగి పోస్టాఫీస్ ముందే స్పృహ తప్పి పడిపోయాడు.

అతని చేతిలోని ఉత్తరాలు గాలికి చెల్లాచెదురుగా ఎగిరిపోసాగినై!

-కోలపల్లి ఈశ్వర్

(నెల్లూరు)

